ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించండి: కలెక్టర్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, వీఐపీల నుంచి వచ్చిన లేఖలకు సమాధానం ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం అమలుకు గ్రామ స్థాయి, పురపాలక వార్డు స్థాయిలో కమిటీలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రజావాణికి 30 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, జడ్పీ సీఈవో వెంకటరెడ్డి, డీఆర్‌డీవో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల, న్యూస్‌టుడే: మండలస్థాయి ప్రజావాణిలో అందిన వినతులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్చర్లలో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మండలస్థాయి ప్రజావాణి కార్యక్రమంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు. సమావేశంలో అధికారులు, తదితరులు ఉన్నారు.

సమాఖ్య ఖాతాల్లోనూ గోల్‌మాల్

రూ.20 లక్షలకు కనిపించని లెక్కాపత్రాలు

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్యలోనూ ఆర్పీ శ్రీలత.. పొదుపు సొమ్ము దుర్వినియోగానికి పాల్పడ్డారు. సోమవారం దొడ్డలోనిపల్లి రెవెన్యూ వార్డు కార్యాలయానికి చేరుకున్న ముగ్గురు ఆర్పీలతో కూడిన బృందం తొలుత మిగిలిపోయిన 8 స్వయం సహాయక సంఘాల పొదుపు ఖాతాలు, బ్యాంకు లావాదేవీల ఖాతాలు తనిఖీ చేసేందుకు ఎస్‌హెచ్‌జీ సభ్యులకు కబురు పెట్టారు. వీరిలో కొందరి ఖాతాలు పరిశీలించగా అక్రమాలు లేవని గుర్తించారు. మరికొంతమంది తమ ఖాతాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేశారు. ఆర్పీల బృందం కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్య(ఎస్‌ఎల్‌ఎఫ్) పొదుపు ఖాతాలను తనిఖీ చేశారు. సమాఖ్యలో మొత్తం 33 సంఘాలుండగా వారంతా ఇన్నాళ్లు రూ.30 లక్షల వరకు పొదుపు చేశారు. వీటిలో రూ.10 లక్షలు సమాఖ్య నుంచి రుణాలు తీసుకున్నట్లు తీర్మానం దస్త్రాలు, ఇతర రికార్డులు గుర్తించారు. రుణాలు తీసుకున్న సభ్యులు సైతం ఇదే విషయాన్ని తనిఖీ బృందం ఎదుట అంగీకరించారు. మిగిలిన రూ.20 లక్షల సొమ్ము తనిఖీ చేయగా వాటికి సంబంధించిన తీర్మానం దస్త్రాలు, ఇతర రికార్డులు కనిపించలేదు. సంఘాల సభ్యులు కూడా ఆ డబ్బు ఎక్కడున్నాయని ఆర్పీని నిలదీశారు. ఆమె నుంచి సమాధానం లేకపోవడంతో రూ.20 లక్షలు దుర్వినియోగమైనట్లు బృందం గుర్తించింది. సమాఖ్యకు సంబంధించిన రికార్డులు స్వాధీనం చేసుకుని మెప్మా కార్యాలయానికి చేరుకున్నారు. మెప్మా డీఎంసీ శివకుమార్ మాట్లాడుతూ కోయనగర్ సమాఖ్యలో పొదుపు సొమ్ము దుర్వినియోగమైనట్లు ఆర్పీల బృందం గుర్తించిందన్నారు. సమాఖ్యతోపాటు 33 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి ఇప్పటి వరకు రూ.1.40 కోట్ల వరకు దుర్వినియోగం జరిగినట్లు ప్రాథమిక అంచనాలకు వచ్చామని, పూర్తి వివరాలు, దస్త్రాలు మంగళవారం కమిషనర్‌కు సమర్పిస్తామని తెలిపారు.

17, 18 తేదీల్లో ఎస్‌జీఎఫ్ వాలీబాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి వాలీబాల్ బాల, బాలికల జట్ల ఎంపికలను ఈనెల 17, 18 తేదీల్లో చేపడుతున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాదేపల్లి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో 17న అండర్-17 బాల, బాలికల జట్లను, ఈనెల 18న అండర్-14 జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధార్, బోనఫైడ్‌తో పీడీ వడెన్నను 94407 05495 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మార్కెట్ యార్డుల్లో సౌకర్యాలు కల్పనే


మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డులో మొక్కజొన్న ఆరబెడుతున్న రైతు

ఈనాడు, మహబూబ్‌నగర్: వానాకాలం పాలమూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో సౌకర్యాలు లేక కర్షకులు నానా అవస్థలు పడుతున్నారు. పంట క్రయవిక్రయాలతో ఆదాయం వస్తున్నా.. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా.. యార్డుల్లో సమస్యలు రాజ్యమేలుతూనే ఉన్నాయి. పంట విక్రయించేందుకు ఇక్కడికి వచ్చే రైతులకు అవస్థలు తప్పడంలేదు. ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, నారాయణపేట, మక్తల్, కోస్గి, గద్వాల, అలంపూర్, మదనాపురం, పెబ్బేరు, ఆత్మకూరు, వనపర్తి, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేటలో మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఈ వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 18.65 లక్షల ఎకరాల సాధారణ సాగు ఉండగా 16.82 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. వరి-7.64 లక్షల ఎకరాలు, పత్తి-6 లక్షలు, కందులు-1.31 లక్షలు, మొక్కజొన్న-81 వేలు, జొన్న- 32 వేలు, వేరుసెనగ-18 వేల ఎకరాల్లో సాగయ్యాయి. మరికొద్ది రోజుల్లో పంటలు చేతికి రానున్నాయి. ప్రస్తుతం మార్కెట్ యార్డులకు మొక్కజొన్న వస్తోంది. ఈ నెలాఖరులో కందులు, వేరుసెనగ, వరి కూడా వచ్చే అవకాశాలున్నాయి. యార్డుల్లో కనీస సదుపాయాల్లేక రైతులు ఇబ్బందులు పడటమేగాక గత రెండు, మూడేళ్లుగా ఇక్కడ పంటలకు సరైన ధర రాక తీవ్రంగా నష్టపోయిన వాళ్లూ ఉన్నారు.

అంతా ఒక్కటై.. : ఉమ్మడి జిల్లాలో పలు వ్యవసాయ మార్కెట్లలో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కుమ్మక్కయ్యి రైతుకు మంచి ధర రాకుండా చేస్తున్నారు. కొన్నిచోట్ల వీరికి అధికారుల నుంచి కూడా మద్దతు ఉండటంతో కర్షకులు తీవ్రంగా నష్టపోతున్నారు. సరైన ధరలు రాక కర్షకులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేసిన ఘటనలున్నాయి. మహబూబ్‌నగర్, గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తిలోని ప్రధాన మార్కెట్ యార్డులతో పాటు పలుచోట్ల వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు తమను మోసం చేస్తున్నారని తరచూ ఆందోళనలు జరిగాయి. ఎక్కువగా మొక్కజొన్న, కందులు, ధాన్యం విక్రయాల్లో మోసాలు జరుగుతున్నాయి. మార్కెట్ యార్డుల్లో రైతులకు సరైన ధర వచ్చేలా మార్కెటింగ్, రెవెన్యూ, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా కౌంటర్లు వేసి పర్యవేక్షణ చేపట్టాలి. ఉమ్మడి జిల్లాలో ఏ మార్కెట్ యార్డులోనూ ఇది సక్రమంగా అమలు కావడం లేదు. మరికొద్ది రోజుల్లో యార్డులకు పెద్ద ఎత్తున పంట ఉత్పత్తులు వచ్చే అవకాశం ఉండటంతో ఇప్పటి నుంచే అధికారులు దృష్టి సారిస్తేనే రైతులకు మేలు జరిగే అవకాశాలున్నాయి. దీనిపై మార్కెటింగ్‌శాఖ మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల ఏడీ బాలమణి 'ఈనాడు'తో మాట్లాడుతూ మార్కెట్ యార్డుల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు రైతులకు మంచి ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సౌకర్యాలు కల్పించాలి..

- రైతుల కోసం ప్రత్యేకంగా మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి
- విశ్రాంతి కోసం ప్రత్యేక గదులను సిద్ధంగా ఉంచాలి
- ధాన్యం కోసం షెడ్డులను ఏర్పాటు చేయాలి
- రాత్రివేళల్లో ఇబ్బందుల్లేకుండా విద్యుత్తు సౌకర్యం కల్పించాలి
- ధాన్యం వర్షానికి తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలి
- పంటకు మంచి ధర వచ్చేందుకు ఈ-నామ్ వ్యవస్థను అమలు చేయాలి.

జిల్లా	సాధారణ విస్తీర్ణం (ఎకరాల్లో..)	సాగైన విస్తీర్ణం (ఎకరాల్లో)
మహబూబ్‌నగర్	3,34,159	3,25,626
నారాయణపేట	4,27,260	4,22,585
నాగర్‌కర్నూల్	5,26,606	4,08,917
వనపర్తి	2,40,233	2,29,588
గద్వాల	3,37,011	2,95,340

ఆర్టీసీకి దసరా పండగ


హైదరాబాద్ బస్సెక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా ఆర్టీసీకి భారీగా రాబడి సమకూరింది. ఈనెల 1వ తేదీ నుంచి 11 వరకు ప్రత్యేక బస్సులు నడిపిన ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ మంచి ఆదాయం రాబట్టింది. మహబూబ్‌నగర్ రీజియన్‌లోని 10 డిపోల్లో రద్దీకి అనుగుణంగా దసరా పర్వదినానికి వచ్చే ప్రయాణికుల కోసం బస్సులు అందుబాటులో ఉంచి మంచి రాబడిని సాధించింది. ఈనెల 11న ఆర్టీసీకి భారీగా రాబడి వచ్చింది. మొత్తంగా 3.52 లక్షల కిలోమీటర్ల మేర బస్సులు తిప్పిన సంస్థ 103.04 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో 4,60,727 మంది ప్రయాణికుల్ని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చి రూ.2.17 కోట్ల రాబడి సాధించింది. 10న 3.50 లక్షల కి.మీ తిప్పి ఓఆర్ 100.59తో 4,45,159 మంది ప్రయాణికుల్ని చేరవేసి రూ.2.08కోట్లు రాబడి అందుకుంది. 9న 4,31,166 లక్షల మంది ప్రయాణికుల్ని గమ్యస్థానాలకు చేర్చి రూ.1.97 కోట్ల రాబడి సాధించింది.

తిరుగు ప్రయాణంలో..: సొంతూళ్లలో ఉత్సాహంగా పండగ చేసుకున్న ప్రయాణికులు హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తిరుగు ప్రయాణం కావడంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. నిత్యం వేలాది మంది ప్రయాణికులు తరలి వెళ్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఆదివారం నుంచి ఆర్టీసీ రీజియన్ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. సోమవారం మహబూబ్‌నగర్ బస్టాండులో ఏ బస్సు చూసినా కిక్కిరిసిన ప్రయాణికులతో వెళ్తున్నాయి. మరో రెండు రోజులు తిరుగు ప్రయాణం కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్ఎం వి.శ్రీదేవి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. మొత్తం 9 డిపోల నుంచి 210 బస్సులు నడపనున్నట్లు చెప్పారు.

11న పరిస్థితి ఇలా..

డిపో	తిరిగిన కి.మీ(వేలల్లో)	ఓఆర్ (శాతం)	ప్రయాణికులు	రాబడి (రూ.లక్షల్లో)
మహబూబ్‌నగర్	0.55	103.18	60,295	34.21
వనపర్తి	0.47	108.03	66,343	29.94
గద్వాల	0.44	107.45	71,440	27.66
కల్వకుర్తి	0.41	103.81	48,744	24.57
నాగర్‌కర్నూల్	0.35	112.08	59,645	23.16
నారాయణపేట	0.36	96.51	39,217	21.29
అచ్చంపేట	0.33	101.60	36,989	20.10
షాద్‌నగర్	0.31	97.72	38,049	18.01
కొల్లాపూర్	0.28	94.79	32,741	15.77
కోస్గి	0.05	92.78	7,264	2.52

కొత్త ఉపాధ్యాయులకు నేడు కౌన్సెలింగ్

ఒక్క రోజులోనే పాఠశాలలకు కేటాయింపు


మహబూబ్‌నగర్ ప్రభుత్వ డైట్ కళాశాలలో ఎంఈవోలకు, జీహెచ్‌ఎంలకు సూచనలు చేస్తున్న డీఈవో రవీందర్


పాలమూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ-2024లో నియామకమైన అభ్యర్థులకు 15న కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో డీఎస్సీ ద్వారా నియమించిన వారికి ఒక్క రోజులోనే పాఠశాలలు కేటాయించనున్నారు. ఈనెల 9న సీఎం సమక్షంలో ఎల్బీస్టేడియంలో డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించిన విషయం విదితమే. జిల్లాలో ఆయా పాఠశాలల్లో ఉన్న ఖాళీలను గుర్తించి వాటిని అభ్యర్థులకు తెలిసేలా అంతర్జాలంలో పెట్టనున్నారు. 243 ఉపాధ్యాయ పోస్టులకు 223 పోస్టులకు అర్హత కలిగిన వారిని ఎంపిక చేయాల్సి ఉండగా, అందులో 196 మందికి మాత్రమే అవకాశం దక్కింది. మిగతా 27 పోస్టుల్లో అర్హత కలిగిన వారు లేరు. ప్రత్యేక అవసరాల విద్యకు కేటాయించిన మరో 20 పోస్టులకు సంబంధించి ఎంపికలు చేయలేదు. వాటికి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించడం లేదు. మిగతా వారికి మంగళవారం ఐడీవోసీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

కొత్త పోస్టింగ్‌లు ఇలా...: డీఎస్సీ-2024లో ఎంపికైన వారికి నిర్వహించే కౌన్సెలింగ్‌లో అభ్యర్థులు జాబితాలో ప్రదర్శించే ఖాళీల్లో తమకు అనువైన పాఠశాలలను ఎంపిక చేసుకోవచ్చు. ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ ప్రక్రియ ఉండనుంది. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో తక్కువ పోస్టులు ఉండటంతో వారి కౌన్సెలింగ్ త్వరగానే పూర్తవుతుంది. ఎస్జీటీ విభాగంలో ఎక్కువ పోస్టులు ఉండటంతో అందులో దూర ప్రాంతాల పాఠశాలలకు కూడా వెళ్లాల్సి ఉంటుంది. నేడు కౌన్సెలింగ్ నిర్వహించే పోస్టుల వివరాలిలా ఉన్నాయి...● జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులకు ప్రభుత్వం అంతర్జాలం ద్వారా ఈ ఏడాది జూన్ చివరివారంలో బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించింది. దాదాపు 350 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు కొత్త పాఠశాలలకు బదిలీ కాగా వారి స్థానాల్లో రిలీవర్స్ రాకపోవడంతో అక్కడే ఉండిపోయారు. ఇప్పుడు కొత్తగా వచ్చే డీఎస్సీ అభ్యర్థులు వారి పాఠశాలలకు రానుండటంతో ఎవరు రిలీవర్ వచ్చినా వారు అక్కడ నుంచి బదిలీ అయి కొత్త పాఠశాలలకు పాత వారు వెళ్లాల్సి ఉంటుంది. వారంతా 15న రిలీవ్ అయి 16న వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరాల్సి ఉంటుంది.

పారదర్శకంగా ప్రక్రియ..: డీఎస్సీ ద్వారా కొత్త నియామకమైన వారికి పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయిస్తాం. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట నియామక ఉత్తర్వు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, హాల్ టికెట్ తదితర వాటిని తీసుకురావాలి. ఖాళీలను www.palamurubadi.com అంతర్జాలంలో పెడుతున్నాం. అభ్యర్థులు అందులో ఖాళీగా ఉన్న పాఠశాలల వివరాలను తెలుసుకొని కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి.

- రవీందర్, డీఈవో, మహబూబ్‌నగర్

ఉపాధ్యాయ పోస్టు	కేటాయించినవి	భర్తీ చేస్తున్నవి	మిగిలినవి
ఎస్ఏ జీవశాస్త్రం (తెలుగు)	07	06	01
ఎస్ఏ గణితం (తెలుగు)	03	03	00
ఎస్ఏ గణితం (ఉర్దూ)	01	01	00
ఎస్ఏ భౌతిక శాస్త్రం (తెలుగు)	02	02	00
ఎస్ఏ భౌతిక శాస్త్రం (ఉర్దూ)	01	01	00
ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ (తెలుగు)	01	01	00
ఎస్ఏ హిందీ	03	03	00
ఎస్ఏ సాంఘిక శాస్త్రం (తెలుగు)	12	12	00
ఎస్ఏ సాంఘిక శాస్త్రం (ఉర్దూ)	02	01	01
ఎస్ఏ తెలుగు	03	03	00
ఎస్ఏ ఆంగ్లం	02	02	00
ఎస్ఏ ఉర్దూ	01	00	01
ఎల్పీ హిందీ	06	06	00
ఎల్పీ తెలుగు	10	10	00
ఎల్పీ ఉర్దూ	08	03	05
ఎస్జీటీ (తెలుగు)	121	118	03
ఎస్జీటీ (ఉర్దూ)	25	11	14
పీఈటీ (తెలుగు)	06	06	00
పీఈటీ (ఉర్దూ)	02	01	01
ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్	07	06	01
ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్	20	00	20
మొత్తం	243	196	47



రైతేరాజు 6 లో..

104శాతం ఓఆర్‌తో రీజియన్ అగ్రస్థానం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: దసరా పండగను పురస్కరించుకుని ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపి రాష్ట్రంలోనే అత్యధిక ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 104శాతం సాధించి అగ్రస్థానంలో నిలిచిందని ఆర్ఎం వి.శ్రీదేవి తెలిపారు. ఈనెల 1 నుంచి 11 వరకు ఉమ్మడి జిల్లాలోని పది డిపోల పరిధిలో వివిధ మార్గాల్లో బస్సులు నడిపి మంచి ఓఆర్ సాధించడంతో పాటు మూడు బస్ డిపోలు ఉత్తమ (కిలో మీటరుకు ఆదాయం) ఈపీకేతో పాటు ఓఆర్ అవార్డులకు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ డిపో ఈపీకే రూ.67.1, ఓఆర్ 114.3%, వనపర్తి డిపో ఈపీకే రూ.65.35తో ఓఆర్ 110%, గద్వాల డిపో కిలోమీటరుకు రూ.63.67తో ఓఆర్ 108.62శాతం గడించిందని ఆర్ఎం తెలిపారు. ఇందుకు కృషి చేసిన అధికారులను, డ్రైవర్, కండక్టర్లను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అభినందించినట్లు పేర్కొన్నారు. దసరా తిరుగు ప్రయాణం రద్దీకి అనుగుణంగా ఈనెల 13 నుంచి 16 వరకు 210 బస్సులను హైదరాబాద్‌కు నడుపుతున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ 30, వనపర్తి 27, అచ్చంపేట 23, కొల్లాపూర్ 23, గద్వాల్ 22, కల్వకుర్తి 22, నారాయణపేట 22, షాద్‌నగర్ 21, నాగర్‌కర్నూల్ 20 బస్సులు నడుస్తాయన్నారు.

బీమా పథకాలపై జన సురక్ష ప్రచారం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: బీమా పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఈ నెల 15 నుంచి వచ్చే ఏడాది జనవరి 15 వరకు మూడ్నెళ్ల పాటు దీనిపై జన సురక్ష ప్రచారం చేపట్టాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం బీమా పథకాలపై సమీక్షించారు. పీఎంఎస్‌బీవైలో ఏడాదికి రూ.20 ప్రీమియంతో ప్రమాద బీమా కవర్ అయ్యేలా 18-70 ఏళ్ల మధ్య వయస్సున్న వారు అర్హులన్నారు. పీఎంజేజేబీవైలో రూ.436 వార్షిక ప్రీమియంతో అన్ని రకాల మరణాలను కవర్ చేస్తుందన్నారు. 18-50 ఏళ్ల మధ్య వారు ఈ బీమా పొందవచ్చన్నారు. ఈ బీమా పథకాలను అన్ని బ్యాంకులు, తపాలా కార్యాలయాల నుంచి పొందవచ్చని వివరించారు.

జూరాలకు వరద తాకిడి

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జూరాల ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల వల్ల ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. గత రెండు రోజులుగా నిలకడగా కొనసాగిన వరద సోమవారం ఉదయం నుంచి పెరుగుతూ వస్తోంది. దీంతో అధికారులు విద్యుత్తు ఉత్పత్తి కోసం 38,499 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో పాటు ప్రాజెక్టు రెండు గేట్లు తెరిచి 14,128 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం జూరాలకు 58,200 క్యూసెక్కుల నీరు వస్తోంది. కుడి కాలువకు 731 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1,030 క్యూసెక్కులతో పాటు జూరాల సమాంతర కాలువకు 400 క్యూసెక్కులు, బీమా ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 318.150 మీటర్ల స్థాయిలో 8.909 టీఎంసీల నీటిని నిల్వను రికార్డు చేస్తున్న అధికారులు ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లోలను పర్యవేక్షిస్తున్నారు.

తుంగభద్ర నదిలో 88 వేల క్యూసెక్కుల ప్రవాహం


దిగువకు భారీగా విడుదలవుతున్న వరద నీరు

శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో సోమవారం 88,860 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట 12.5 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 6 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, అది రాష్ట్రానికి వచ్చే సరికి ప్రధానకాల్వలో 2 అడుగులుగా ఉంది.

● ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా రాజోలి శివారులోని సుంకేసుల జలాశయానికి భారీగా వరద వస్తోంది. సోమవారం ఎగువ నుంచి 92,950 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. డ్యాంలోని 30 గేట్లలో 22 ఎత్తి దిగువనున్న 90,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, కేసీ కెనాల్‌కు 2,400 క్యూసెక్కులు వదులుతున్నామని డ్యాం అధికారులు తెలిపారు. భారీ వరద నేపథ్యంలో 1.23 టీఎంసీల సామర్థ్యానికి డ్యాంలో 0.91 టీఎంసీలు నిల్వ ఉంచినట్లుగా వారు పేర్కొన్నారు.

పంట నష్ట పరిహారం విడుదల

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లాకు పంట నష్టం విడుదల చేసింది. గత ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఈ పరిహారం అందించనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 766 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. 912 మంది రైతులు రూ.86.60 లక్షలను నష్టపోయినట్లు గుర్తించడంతో వారందరికీ ఈ పరిహారం అందనుంది.

మొక్కజొన్న క్వింటా రూ.2,456

నవాబ్‌పేట,న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని బాలాజీ వ్యవసాయ మార్కెట్‌యార్డుకు సోమవారం 1,633 బస్తాల మొక్కజొన్న ధాన్యం వచ్చింది. 817 క్వింటాళ్ల మొక్కజొన్న వచ్చినట్లు మార్కెట్ సెక్రటరీ లక్ష్మారెడ్డి తెలిపారు. క్వింటా గరిష్ఠంగా రూ.2,456, కనిష్ఠంగా రూ.1,690 ధర పలికినట్లు చెప్పారు. ధాన్యం విక్రయంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

సమగ్ర కుల గణనకు సిద్ధం

రెండు నెలల్లో నివేదికకు ఆదేశం



కొత్తకోట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మరోసారి సామాజిక సమగ్ర సర్వేకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇంటింటికీ తిరిగి అన్ని కుటుంబాల ఆర్థిక, సామాజిక స్థితిగతుల్ని అంచనా వేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరిపిస్తామని స్పష్టతనిచ్చారు. 2014లో తొలి తెలంగాణ ప్రభుత్వం సమగ్ర సర్వేను చేపట్టినప్పటికీ జిల్లాలవారీగా, కులాలవారీగా జనాభాను మాత్రం ప్రకటించలేదు. ప్రస్తుత సర్వేతో జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓసీ వర్గాల రాజకీయ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ గణన ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు. ఈ సర్వే నివేదికలు రెండు నెలల్లోపే పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చింది.

ఉమ్మడి జిలాల్లో..: ఉమ్మడి జిల్లాలో 2014లో చేపట్టిన సమగ్ర సర్వేను పరిశీలిస్తే జనాభా 42,84,024 ఉండగా 9,67,013 కుటుంబాలు నివసిస్తున్నట్లు తేల్చారు. వీటిలో 5,80,208 కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు అర్హులు కాగా 25,70,412 మందిని ఆయా కుటుంబసభ్యులుగా తేల్చారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీల జనాభాను పరిశీలిస్తే ఎస్సీలు 4,29,191, ఎస్టీలు 2,91,863 మంది ఉన్నట్లు తేల్చారు. పదేళ్లలో ఈ అంకెల్లో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి.

లెక్కలు తేలితే...: బీసీల్లో వందకుపైగా కులాలు, ఉపకులాలు ఉన్నప్పటికీ ఉద్యోగ, రాజకీయ ప్రాధాన్య రిజర్వేషన్ల శాతం మాత్రం తక్కువగా ఉంటున్నట్లు ఆయా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో గత ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే కుల గణన చేపడతామని హామీ ఇచ్చారు. జనాభాలో సగాని కంటే ఎక్కువ ఉన్న తమకు అదే ప్రాతిపదికన తమకు ఫలాలు దక్కాలని గత కొన్నేళ్లుగా బీసీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ వాదనను ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు నినాదంగా మార్చుకున్నాయి. రాజకీయంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 35 శాతం, విద్య ఉద్యోగావకాశాల్లో 29 శాతం రిజర్వేషన్లు దక్కుతుండటాన్ని ఆ వర్గం వ్యతిరేకిస్తోంది.



ఆరోగ్యం మన చేతిలోనే..!

సంపూర్ణ ఆరోగ్యానికి చేతుల శుభ్రత ఎంతో కీలకం. భోజనం చేసే ముందు, తుమ్మినా, దగ్గినా, రోగికి సపర్యలు చేశాక, ఆటలు ఆడిన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడం వల్ల చాలా రకాల వ్యాధులు దరిచేరవని వైద్యులు చెబుతారు. ఈ విషయంపై చాలా మందికి అవగాహన లేదు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించే వారు లేకుండా పోయారు. ఫలితంగా చాలా మంది జబ్బుల బారిన పడుతున్నారు. మంగళవారం ప్రపంచ చేతుల పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనం.

మీకు తెలుసా!

- సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవడం వల్ల అతిసారాన్ని 30 శాతం మేర, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు 20 శాతం మేర తగ్గించుకోవచ్చు
- ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి చేతులు శుభ్రం చేసుకునే సౌకర్యం కొరవడిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది
- జాతీయ శాంపిల్ సర్వే ప్రకారం దేశంలోని పౌరుల్లో 26 శాతం మంది మల విసర్జన తరువాత సబ్బుతో చేతులు కడుక్కోవడం లేదు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 80 శాతం పాఠశాలల్లో విద్యార్థులకు సబ్బులు అందుబాటులో ఉంచడం లేదు.

న్యూస్‌టుడే, రాజోలి, కోస్గి : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,227 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 3.20 లక్షల మందికి పైగా విద్యార్థులు అభ్యసిస్తున్నారు. 1,500కి పైగా పాఠశాలల్లో చేతులు కడుక్కోవడానికి వీలైన కుళాయిలు అందుబాటులో లేవు. 1,099 పాఠశాలల్లో మన ఊరు-మన బడి పనుల్లో భాగంగా కుళాయిలను ఏర్పాటు చేశారు. వీటిలో కొన్నింటికి నీటి సరఫరా లేదు. విద్యార్థులు మట్టిలో ఆడుకుని, అపరిశుభ్రత మధ్య మల, మూత్ర విసర్జనకు వెళ్తున్నారు. పాఠశాలల్లో సబ్బుల కొనుగోలుకు నిర్వహణ నిధుల్లో కేటాయింపులు చేస్తున్నా.. భోజనానికి ముందు వాటిని అందుబాటులో ఉంచడం లేదు. ఇలాంటి పరిస్థితి లేకుండా ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా పిల్లలు చేతులు శుభ్రం చేసుకునేలా చూడాలి. సబ్బు తప్పనిసరిగా అందుబాటులో ఉంచడంతో పాటు, శుభ్రం చేసుకోకపోతే కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.



ఇలా చేద్దాం..

- ధారాళంగా వచ్చే కుళాయి నీటితో చేతులు శుభ్రం చేసుకోవాలి.
- తరువాత అర చేతులు, వేళ్ల మధ్య సబ్బు లేదా లోషన్‌తో రుద్దుకోవాలి.
- చేతుల వెనుక వైపునుంచి వేళ్ల మధ్య శుభ్రం చేసుకోవాలి.
- చేతులను ముని వేళ్లతో రుద్దుకోవాలి. బొటన వేళ్లు శుభ్రం చేసుకోవాలి.
- మణికట్టు వద్ద బాగా రుద్దుకొని ధారాళంగా వచ్చే నీటికింద ఉంచాలి.



కలిగే అనర్థాలు

- చేతులు శుభ్రంగా ఉంచుకోకపోతే తొందరగా అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.
- మట్టిలో ఆడుకొని శుభ్రం చేసుకోకపోవడం వల్ల నులి పురుగులు, బద్దె పురుగులు పిల్లల కడుపులో పెరిగే అవకాశం ఉంది. దీని వల్ల రక్త హీనత ఏర్పడుతుంది.
- అపరిశుభ్ర చేతులతో ఆహారం తీసుకోవడం వల్ల అతిసారం, టైఫాయిడ్, పచ్చకామెర్లు, అంటువ్యాధులు, రక్త విరేచనాల బారిన పడే ప్రమాదం కూడా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



రాజోలి ప్రాథమిక పాఠశాలలు కుళాయిలు లేని నీటి ట్యాంకు..



తల్లిదండ్రులూ మీదే బాధ్యత

తల్లిదండ్రులు రోజూ పిల్లల చేతులు శుభ్రం చేయాలి. పాఠశాల నుంచి వచ్చిన వారికి, ఆటలు ఆడుకుని ఇంటికి వచ్చిన చిన్నారులు చేతులు శుభ్రం చేసుకునేలా చూడాలి. వారికి ఇదో అలవాటుగా మార్చాలి. పెరిగిన గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. అపరిశుభ్రత వల్ల కలిగే అనర్థాల గురించి వివరించి చెప్పాలి. మల విసర్జన అనంతరం సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. వ్యర్థాలను తాకినప్పుడు కూడా చేతుల శుభ్రత తప్పనిసరి.

- డా.భరత్, చిన్నపిల్లల వైద్య నిపుణులు, గద్వాల ఆసుపత్రి

పిట్ట కొంచెం.. ఆదాయం ఘనం





షెడ్డులో కముజులు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను ఎంపిక చేసుకుని వాటిని నిత్యాదాయ మార్గంగా మార్చుకోవచ్చని నిరూపిస్తున్నారు వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన యువ రైతు శివప్రసాద్. డిగ్రీ పూర్తి చేసి వ్యవసాయంలో తండ్రికి సాయం చేస్తూ చేదోడు, వాదోడుగా ఉంటున్నారు. ఏటా వ్యవసాయంలో పెట్టుబడి మినహా లాభాలు రావడం లేదు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న సమయంలో హైదరాబాద్‌లో కముజుల పెంపకంపై శిక్షణ ఇస్తున్నారని తెలిసి అక్కడికి వెళ్లారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నెల రోజుల పాటు కముజు పిల్లల పెంపకం, దాణా, రోగనిరోధక శక్తిని పెంపొందించడం వంటి పలు అంశాలపై శిక్షణ పొందారు.

అదనంగా ప్రోత్సహిస్తే..: ప్రస్తుతం చిన్న షెడ్‌లో కముజు పిల్లలు పెంచుతున్నారు. ప్రభుత్వం రుణం అందించి ప్రోత్సహిస్తే 5 వేల పిల్లలు సరిపడా షెడ్డు నిర్మించి, మరో ఐదుగురికి ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉంటుంది. జిల్లాలోని పలు దుకాణాలకు నేరుగా వీటిని తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రోత్సాహం అందిస్తే వ్యాపారంలో మరింతగా రాణిస్తా.



- శివప్రసాద్, రామకృష్ణాపురం

నెలకు నికర ఆదాయం: శిక్షణ అనంతరం శివప్రసాద్ గ్రామంలోనే చిన్న షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. కముజుల కోసం రాజేంద్రనగర్‌లోని శిక్షణ కేంద్రం అధికారులను సంప్రదించారు. మొదటి విడతగా ఒకటి రూ.10 చొప్పున 500 పిల్లలు కొనుగోలు చేశారు. అక్కడి నుంచి వాటిని తీసుకురావడానికి రవాణా ఖర్చు రూ.2,500, దాణాకు రూ.8 వేలు, మందులు, ఇతర ఖర్చులు రూ.1,500 మొత్తం రూ.17 వేలు ఖర్చయ్యాయి. కముజు పిల్లలను జాగ్రత్తగా సంరక్షించడంతో 45 రోజుల్లోనే 250 గ్రాముల బరువు పెరిగాయి. ఒక్కటి రూ.180 చొప్పున విక్రయిస్తున్నారు. ఆర్డర్లపై కిలో రూ.700 వరకు అమ్ముతున్నారు. ఖర్చులు మినహా 45 రోజులకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు నికర ఆదాయం వస్తోంది.

కందిలో ఎండు తెగుళ్లు.. సస్యరక్షణ చర్యలు



తెగులుతో ఎండిపోయిన మొక్కలు

మానవపాడు, న్యూస్‌టుడే : భారీ వర్షాలకు కందిపంటను ఎండుతెగులు ఆశించింది. చేసేదేమీ లేక కొందరు రైతులు పంటను పూర్తిగా తొలగించి, వేరే పంటల సాగు చేస్తున్నారు. ఎండుతెగులుతో పాటు చీడపీడల నుంచి కంది పంటను ఎలా కాపాడుకోవాలి, తెగుళ్ల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయాధికారి సక్రియానాయక్ పలు సూచనలు చేశారు.

నీటి యాజమాన్యం : పూత, కాత సమయాల్లో సరిపడా నీటితడులు అందించాలి. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా కంది పండుతుంది.

ఆకుచుట్టు పురుగు : ఆకులను ముట్టలుగా చేసి పత్రహరితాన్ని పీల్చి వేస్తాయి. మొక్క ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. నివారణ చర్యగా ఒక లీటరు నీటిలో 1.6-1 మి.లీ. మోనోక్రోటోఫాస్ కలిపి పిచికారీ చేయాలి.

కాయతొలుచు పురుగు : పూత, కాత సమయాల్లో ఆశిస్తుంది. కాయలకు రంధ్రాలు చేసి లోపల ఉన్న గింజలను తినేస్తుంది. పురుగు ఉధృతి తక్కువగా ఉన్నప్పుడు ఒక లీటరు నీటికి 5 శాతం వేప కషాయం లేదా 5 మి.లీ. వేపనూనె కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే పూత సమయంలో 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్, కాయ దశలో ఒక లీటరు నీటికి 1.5 ఎంఎల్ లేదా 2 ఎంఎల్ క్వినాల్‌ఫాస్ మందు కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఎండుతెగులు : ఈ తెగులు వల్ల ఎదుగుతున్న మొక్కలు ఎండిపోతాయి. ఎండిన మొక్కలను వేరు నుంచి తొలగించి కాల్చాలి. దీని వల్ల వేరే మొక్కలకు తెగులు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చు. నివారణ చర్యగా ఒక లీటరు నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు కలిపి వేర్లు తడిచే విధంగా మొక్కల చుట్టూ పోయాలి.

కలుపు యాజమాన్యం

ఈ పంటకు కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. విత్తనం వేసిన 2 రోజుల్లోపు లీటరు నీటికి పెండిమిథాలిన్ 5 మి.లీ. కలిపి నేల మొత్తం తడిచేలా పిచికారీ చేయాలి. మొక్కలు ఎదుగుతున్న సమయంలో కలుపు నివారణ చర్యల్లో భాగంగా సాళ్ల మధ్య గుంటుక లేదా గొర్రుతో కలుపు తీయాలి. మొక్కలు నేలను కప్పి వేసే వరకు అంతరకృషి చేయాలి. మొక్కల మధ్య కలుపు ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 2 ఎంఎల్ క్విజలోఫాప్ మందు కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు



ప్రశ్నలు - సమాధానాలు

? వరిలో గులాబీ రంగు పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?
- నాగేశ్వర్‌రెడ్డి, పుట్టపల్లి

✓ లీటరు నీటిలో ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లేదా స్పైనోశాడ్ 1 మి.లీ లేదా ఇండాక్సాకార్బ్ 1 మి.లీ లేదా నొవాల్యురాన్ 0.8 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

? వేరుశనగలో వేరుపురుగు నివారణకు తగిన చర్యలు తెలపండి.
- భాస్కర్‌రెడ్డి, ఆత్మకూరు

✓ మొక్కల మొదళ్లలో 200 గ్రాముల ప్రొపినెబ్ 40% + ఇమిడాక్లోప్రిడ్ 40% 40 లీటర్ల నీటిలో కలిపి పోయాలి. ఎకరాకు 6 కిలోల థయామిథాక్సామ్ 0.9% + ఫిప్రోనిల్ 0.2% గుళికలను ఇసుకలో కలిపి తేమ ఉన్నప్పుడు చల్లాలి.

? మిరపలో పై ముడత నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?
- వెంకటస్వామి, రామన్‌పాడ్

✓ ఒక ఎకరాకు ప్రొఫెనోఫాస్ 400 మి.లీ లేదా డైఫెంథియూరాన్ 300 గ్రాములు లేదా స్పైనోశాడ్ 75 మి.లీ లేదా ఫాసలోన్ 400 మి.లీ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

- న్యూస్‌టుడే, మదనాపురం



- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం



పాతాళగంగ సమీపంలో నిలిచిపోయిన వాహనాలు

వాహనాలతో కిక్కిరిసిన శ్రీశైలం రహదారి

శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి దుర్గామాత నిమజ్జనం కోసం శ్రీశైలం వెళ్తున్న వాహనాలతో నల్లమలలోని ప్రధాన రహదారి కిక్కిరిసింది. నిమజ్జనం కోసం వచ్చిన వాహనాలను వంతెనపై నిలపడంతో శ్రీశైలం వచ్చిపోయే వారికి ఇబ్బందులు ఎదురయ్యాయి. పాతాళగంగ పరిసరాల్లో ట్రాఫిక్‌ను ఈగలపెంట పోలీసులు క్రమబద్ధీకరించారు.

18న అండర్-23 క్రికెట్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-23 రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ కోసం ముందస్తుగా నిర్వహించే ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఆరు జట్లను ఈ నెల 18న పిల్లలమర్రిదారిలోని ఎండీసీఏ మైదానంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ సోమవారం తెలిపారు. పాల్గొనే క్రీడాకారులతో మొత్తం ఆరు జట్లుగా విభజించి వారి మధ్య ఈనెల 21 నుంచి 28 వరకు టోర్నీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభావంతులతో అండర్-23 ఉమ్మడి తుది జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. హెచ్‌సీఏ రాష్ట్రస్థాయి అండర్-23 క్రికెట్ టోర్నీ నవంబర్ 4 నుంచి వరంగల్, సంగారెడ్డి జిల్లాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు తెల్లటి క్రీడా దుస్తులతో హాజరుకావాలని సూచించారు.

మిల్లులో రేషన్‌బియ్యం పట్టివేత



పట్టుబడిన వాహనం వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నందకిశోర్, పోలీసులు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : ఖిల్లాగణపురం శివారులోని నవ్య దివ్య రైస్‌మిల్లులో రేషన్ బియ్యం పట్టుబడాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ నందకిశోర్ తెలిపిన వివరాల మేరకు మహబూబ్‌నగర్‌కు చెందిన పుల్లూరు రాజు, పుల్లూరు వెంకటేశ్ సోమవారం ఉదయం ఓమ్ని వాహనంలో 19 క్వింటాళ్ల రేషన్ బియ్యం తీసుకుని ఖిల్లాగణపురం శివారులోని నవ్య దివ్య రైస్‌మిల్లుకు తరలించి వాహనం నుంచి సంచులు దింపుతుండగా సీసీఎస్ పోలీసులు (ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులు) పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులను ఎస్సై సురేశ్ గౌడ్‌కు అప్పగించారు. సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నందకిశోర్ చేరుకుని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. 30 గన్ని బ్యాగులు, 8 ప్లాస్టిక్ సంచుల్లో మొత్తం 19 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని వనపర్తిలోని పౌరసరఫరాల శాఖ గోదాముకు తరలించారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని మహబూబ్‌నగర్ వీరన్నపేటలోని రేషన్ షాప్ డీలర్ చంద్రశేఖర్ వద్ద కిలో రూ.15 చొప్పున కొని నవ్య దివ్య రైస్ మిల్లర్‌కు కిలో రూ.20 చొప్పున విక్రయిస్తున్నట్లు నిందితులు తెలిపారు. వారిపై, రైస్ మిల్ నిర్వాహకుడు పాలవాది లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

భూ రికార్డులు తారుమారు చేశారంటూ.. ప్రజావాణిలో రైతు ఆత్మహత్యాయత్నం



రైతును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాజకీయ అండదండలు బలంగా ఉన్న బడా రైతులు ప్రభుత్వం తమకిచ్చిన భూమికి సంబంధించిన రికార్డులు తారుమారు చేసి వారి పేర్లు ఎక్కించుకున్నారని ఆరోపిస్తూ రైతు పరశురాముడు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. సకాలంలో పోలీసులు, సిబ్బంది అడ్డుకుని ఆయనను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్సపొందుతున్నాడు.

బాధిత కుటుంబ సభ్యులు తిమ్మప్ప, కృష్ణల కథనం ప్రకారం.. అయిజ మండలం యాపదిన్నె శివారులోని గుడిదొడ్డి గ్రామానికి చెందిన వడ్డే సవారన్నకు ప్రభుత్వం 1986లో సర్వే నంబర్ 321లో 5 ఎకరాల భూమిని మంజూరు చేసింది. ఆయన మృతిచెందిన తర్వాత వారసత్వంగా ముగ్గురు కుమారులు పరశురాముడు, తిమ్మప్ప, కృష్ణ పేరున ఖాతా మార్పు చేయాలని గత కొన్నేళ్ల నుంచి అయిజ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంటున్నా పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఆ మూడు కుటుంబాలు జీవనోపాధి కోసం కడప ప్రాంతానికి వలస వెళ్లారు. తిరిగి గ్రామానికి వచ్చేసరికి వారసత్వంగా కుటుంబానికి సంక్రమించాల్సిన భూమిని గ్రామానికి చెందిన ముగ్గురు బడా నాయకులు కబ్జా చేసి వారి పొలంలో కలిపేసుకున్నారు. ఇదీ అన్యాయమంటూ పలుమార్లు అయిజ తహసీల్దార్ కార్యాలయంలో మా భూమిని సర్వే చేసి హద్దు చూపించాలని దరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేకపోయింది. గతంలో ఒక సారి సర్వే అధికారులు వచ్చినా బడా నేతలు బెదిరించడంతో వారు వెళ్లిపోయారు. దీంతో పిల్లాపాపలతో సహా కలెక్టర్‌కు తమ గోడు వినిపించడానికి వచ్చామని వారు వివరించారు. తమ అన్న పరశురాముడు ఆ బాధతోనే ఆత్మహత్యకు యత్నించారని తెలిపారు. అధికారులు తమ భూమిని సర్వే చేసి న్యాయం చేయాలని వేడుకుంటున్నామన్నారు. ఇదిలా ఉండగా బాధిత రైతు గత జులై 1న కూడా ప్రజావాణిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు.

అటవీ శాఖకు వాహనం అందజేత



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరు, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ట్రస్టీ అనిల్‌కుమార్ వి ఏపూర్

మన్ననూరు (అమ్రాబాద్), న్యూస్‌టుడే: పులుల సంరక్షణ, వాటి ఆవాసాల పరిరక్షణకు 'వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్' సంస్థ కట్టుబడి ఉందని ఆ సంస్థ ట్రస్టీ, హైదరాబాద్ కార్యాలయ ఛైర్మన్ అనిల్ కుమార్ వి ఏపూర్ అన్నారు. అమ్రాబాద్ పెద్ద పులుల అభయారణ్యానికి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బొలెరో వాహనాన్ని పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరుకు అందజేశారు. మన్ననూరులోని పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వన్యప్రాణుల వేటను నియంత్రించేందుకు వాహనం ఉపయోగపడుతుందని చెప్పారు. ఏటీఆర్‌లో పులుల సంరక్షణకు ఫ్లాష్ లైట్లు, మెటల్ డిటెక్టర్లు, జీపీఎస్ సిస్టంలు, ఇతర సామగ్రి అందించామని వివరించారు. ఏటీఆర్ ఎఫ్‌డీ శివాని డోగ్రా, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రాష్ట్ర డైరెక్టర్ ఫరీదా టంపాల్, ఎఫ్‌డీవో రామమూర్తి, ఎఫ్ఆర్వోలు గురుప్రసాద్, మహేందర్, చంద్రశేఖర్, దేవజ, డీఆర్వో రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగల చేతివాటం

28.5 తులాల బంగారం ఆభరణాల చోరీ



బస్సు వద్ద కిక్కిరిసిన ప్రయాణికులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: దసరా పండగకు వచ్చిన ప్రయాణికుల బ్యాగులను దొంగలు తమ చేతివాటంతో తస్కరించారు. దీంతో ముగ్గురు బాధితులకు చెందిన 28.5 తులాల బంగారం, 60 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ నెల 9 నుంచి దసరా పండగ కోసం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రాకపోకలు సాగించారు. ఇతర ప్రాంతాల నుంచి తమ సొంత గ్రామాలకు వెళ్లడానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. దీంతో నాలుగు రోజుల నుంచి ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఇదే అదునుగా దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. దొంగలను నియంత్రణ చేయడానికి పోలీస్ శాఖ 20 మంది ఏఆర్ పోలీస్ సిబ్బందిని నియమించినా దొంగలు తమ తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. బంగారం, ఇతర ఆభరణాలు పోగొట్టుకున్న పలువురు బాధితులు రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు.

14 తులాల బంగారం మాయం...: హైదరాబాద్‌లో ఉంటున్న నరేశ్ మిలటరీలో పని చేసి ఉద్యోగ విరమణ చేశాడు. దసరా పండగకి తన సొంతూరుకు వెళ్లడానికి ఈనెల 9న హైదరాబాద్ నుంచి రైలులో మహబూబ్‌నగర్‌కు వచ్చాడు. అక్కడ నుంచి పరిగి వెళ్లడానికి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చి ఊరెళ్లాడు. ఈనెల 11న తన బ్యాగును చూసుకోగా అందులో 14 తులాల బంగారం, 60 తులాల వెండి కనిపించలేదు. దీంతో ఆయన సోమవారం రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఇజాజుద్దీన్ తెలిపారు.

8 తులాల బంగారం..: నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని చిత్తనూర్‌కు చెందిన సలుగుట్టి సుధారాణి పండగకి మహబూబ్‌నగర్‌కు వచ్చింది. అనంతరం సోమవారం తన ఇంటికి వెళ్లడానికి జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌కు వచ్చింది. సాయంత్రం రాయచూర్ బస్సు ఎక్కింది. అనంతరం తన బ్యాగులో ఉన్న ఆధార్ కార్డు కోసం చూడగా చిన్న పర్సు కనిపించలేదు. వెంటనే బస్సు దిగి చుట్టూ పక్కల వెతికినా ఫలితం లేకుండా పోయింది. అనంతరం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అందులో 8 తులాల బంగారం ఉందని, వాటిని వెతికి ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓబుల్‌రెడ్డి తెలిపారు.

మహిళా హోంగార్డు బంగారం చోరీ...: హైదరాబాద్‌లోని చింతలబస్తీలో నివాసం ఉంటున్న మహిళా హోంగార్డు కోస్గీ సువర్ణ సీఎం రేవంత్‌రెడ్డి నివాసం వద్ద విధులు నిర్వర్తిస్తోంది. ఈ నెల 12న పండకి గండీడ్ మండలం కొంరెడ్డిపల్లికి వచ్చింది. అనంతరం సోమవారం తిరిగి ఇంటి నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి మహబూబ్‌నగర్ బస్టాండ్‌కు వచ్చింది. తన ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్ బస్సు ఎక్కింది. ఆమె చేతిలో ఉన్న బ్యాగు చూసుకుంటే జీప్ తెరిచి ఉంది. వెంటనే ఆ బ్యాగ్‌ను తెరిచి చూడగా అందులో ఉన్న ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయాయి. వెంటనే ఆమె రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓబుల్‌రెడ్డి తెలిపారు.

వరకట్న వేధింపులతో వివాహిత బలవన్మరణం



శిరీష

బిజినేపల్లి, న్యూస్‌టుడే : వరకట్న వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన బిజినేపల్లి మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. దేవరకద్ర మండలం అజిలాపూర్ గ్రామానికి చెందిన శిరీష (23)ను 2018లో బిజినేపల్లి మండలం సల్కర్‌పేట గ్రామానికి చెందిన తిరుపతయ్యకు ఇచ్చి వివాహం చేశారు. అదనపు కట్నం కోసం భర్త తరచుగా వేధించడంతో పెద్దలు పలుమార్లు నచ్చజెప్పారు. ఈనెల 8న మరోమారు భర్తతోపాటు అత్త సుదర్శనమ్మ వివాహితను వేధించి, దాడికి పాల్పడ్డారు. మనస్తాపంతో శిరీష అదేరోజు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. మృతదేహంపై గాయాలు ఉన్నాయని, న్యాయం చేయాలని తండ్రి ఆంజనేయులు బిజినేపల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. శిరీషకు ఇద్దరు కుమారులు. భర్త తిరుపతయ్య, అత్త సుదర్శనమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



హరిలాల్

బాలానగర్, న్యూస్‌టుడే: పొలంలో పశువులు మేపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ఓ రైతు మృతి చెందినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు. మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన హరిలాల్(44) సోమవారం ఉదయం పొలంలో విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

రైలు ఢీకొని ఒకరు దుర్మరణం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని తిరుమలదేవుని గుట్టకు చెందిన బండి రాజు (35) ఆదివారం రాత్రి టీడీగుట్ట రైల్వే గేట్ వద్ద పట్టాలు దాటుతున్న క్రమంలో హంద్రీ ఎక్స్‌ప్రెస్ తగలడంతో కిందపడటంతో తల రోడ్డుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి చెవులు సరిగ్గా వినపడవని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులోకి దూకి మహిళ ఆత్మహత్య



అలివేలు

అడ్డాకుల, న్యూస్‌టుడే : చెరువులో దూకి మహిళా ఆత్మహత్య చేసుకున్న ఘటన మూసాపేట మండలం పోల్కంపల్లిలో చోటుచేసుకుంది. మూసాపేట ఎస్సై శ్రీనివాసులు కథనం మేరకు... పోల్కంపల్లికి చెందిన సుందరయ్య కుమార్తె అలివేలు(34)ను మహబూబ్‌నగర్ గ్రామీణ మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన విటల్‌తో పన్నెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ సంతానం, కుటుంబ కలహాల కారణంగా 3 నెలల నుంచి అలివేలు తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రకు ఉపక్రమించిన ఆమె సోమవారం కనిపించలేదు. స్థానిక రైతులు చెరువులో మహిళా మృతదేహం ఉన్నట్టు సమాచారం ఇవ్వడంతో వెళ్లి చూడగా అలివేలుగా గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126-00
రిటైల్	148-00
డ్రెస్డ్	215-00
స్కిన్‌లెస్	244-00

తెరపై ఈనాడు

శ్రీనివాస - విశ్వం, తిరుమల - వెట్టియాన్
బాలాజీ - జనక అయితే గనక, వెంకటేశ్వర - దేవర
వెంకటాద్రి - మా నాన్న సూపర్ హీరో
మైత్రి శ్రీకృష్ణ - మార్టిన్

-న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

మండలాల్లో మొక్కుబడిగా ప్రజావాణి



కోయిలకొండ ప్రజావాణిలో ఎంపీడీవో, ఎంఈవో



మిడ్జిల్: ఉదయం 11గంటలకు ఖాళీగా ఉన్న కుర్చీలు

కోయిలకొండ, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలస్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి అధికారుల నిర్లక్ష్యం కారణంగా మొక్కుబడిగా సాగుతోంది. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఉదయం 10.36 గంటలకు కేవలం ఎంపీడీవో, ఎంఈవో, కొంత మంది పంచాయతీ కార్యదర్శులు మాత్రమే హాజరయ్యారు. మిగతా శాఖల అధికారులు సమయపాలనతో సంబంధం లేకుండా తీరుబాటుగా వచ్చారు. భూసమస్యలపై రెండు ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీవో కాశప్ప తెలిపారు.

మిడ్జిల్: మిడ్జిల్ మండల పరిషత్‌లో నిర్వహించిన ప్రజావాణికి ఉదయం 11గంటలైనా పలువురు మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు హాజరుకాలేదు. వివిధ సమస్యలపై 3 వినతులు వచ్చాయని ఎంపీడీవో గీతాంజలి తెలిపారు.

బాలానగర్: సోమవారం ప్రజావాణికి వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు ఉదయం 10.36 నిమిషాలకు కింది స్థాయి అధికారులు పంపించి 11.30 నిమిషాల తర్వాత అధికారులు హాజరయ్యారు. ఎలాంటి ఫిర్యాదులు రాలేదని అధికారులు తెలిపారు.

రాజాపూర్: రాజాపూర్‌లో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సోమవారం ప్రజావాణిలో యువకులు బుగ్గయ్య, రామచందర్, నాగరాజు, లింగం, రమేష్, నర్సింహులు ఫిర్యాదు చేశారు. పీహెచ్‌సీ సమీపంలో అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం కాలువ తీయడంతో మురుగు నీరు నిల్వతో అనారోగ్యాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని, ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీడీఓ మధుచేందర్ తెలిపారు.

నవాబ్‌పేట: ప్రజావాణిలో 13 వినతులు వచ్చినట్లు ఎంపీడీవో జయరామ్‌నాయక్ తెలిపారు. వాటిలో 3 వినతులను పరిష్కరించినట్లు చెప్పారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని డా. బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్రం బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుకన్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఈ నెల 17న తేదీ సాయంత్రం 5 గంటలలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. 18న ఉదయం ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

జడ్చర్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉర్దూ మీడియం(బాలికల) అధ్యాపక పోస్టులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాణిజ్య శాస్త్రంలో బోధించుటకు పీజీలో 55 శాతం పొందిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 15న సాయంత్రం 4 గంటలలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

అధికారి తీరుపై ఎమ్మెల్యే ఫిర్యాదు

జడ్చర్ల, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ జిల్లా గనులశాఖ ఏడీగా గతంలో పని చేసిన విజయ్‌కుమార్ అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని అతనిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కోరారు. ఆయనపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్టు సోమవారం ఎమ్మెల్యే ఓ ప్రకటనలో తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దుర్గామాత నిమజ్జన ఊరేగింపు



దుర్గామాత ఊరేగింపులో శ్రీరాజరాజేశ్వరిమాత మహిళా మండలి భక్తులు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం లక్ష్మీనగర్, వేంకటేశ్వర కాలనీలోని శ్రీరాజరాజేశ్వరి మాత ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను సోమవారం పట్టణంలో ఊరేగించారు. మహిళా మండలి, ఆలయ కమిటీ, భజన మండలి ఆధ్వర్యంలో భజన సంకీర్తనలు ఆలపిస్తూ సాగిన ఊరేగింపు ఆకట్టుకుంది. అనంతరం అమ్మవారి ప్రతిమను నిమజ్జనానికి భవాని సాగర్‌కు తరలించారు.

ఘనంగా అశోక విజయదశమి వేడుకలు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: బహుజన మహనీయుల శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రం పాత పాలమూరులోని జైభీమ్ చౌరస్తాలో అశోక విజయదశమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుడు, సామ్రాట్ అశోక చక్రవర్తి, డా. బీఆర్. అంబేడ్కర్ చిత్రపటాలకు జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు పాతూరి రమేష్, ఎన్. శ్రీనివాసులు, చెన్నయ్య, గోపాల్ మాట్లాడుతూ అశోక విజయ దశమి ప్రాశస్త్యాన్ని వివరించారు. అశోక విజయదశమి వేడుకలను 1956లోనే డా. బీఆర్. అంబేడ్కర్ నేతృత్వంలో వైభవంగా నిర్వహించారన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థ ప్రతినిధులు నర్సిములు, దేవన్న, శంకరయ్య, నాగరాజు, పాండు, చిన్నరంగయ్య, టి. రాజు, రవి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ నిమజ్జనం

నవాబ్‌పేట, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో సోమవారం బతుకమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. అనంతరం పెద్దశివాలయం దగ్గర మహిళలు బతుకమ్మలకు పూజలు చేశారు. బతుకమ్మ ఆటలు ఆడుతూ గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. గ్రామ సమీప చెరువులో నిమజ్జనం చేశారు.

ఘనంగా తుల్జాభవానీ ఉత్సవాలు

బాలానగర్, న్యూస్‌టుడే: మండలంలోని దేగవత్‌తండాలో దసరా పండుగను పురస్కరించుకొని సోమవారం తుల్జాభవానీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు గిరిజన సంప్రదాయ పద్ధతిలో తండాల్లో ఊరేగింపు చేసి, ఆరాధ్యదేవత తుల్జాభవానీ మాతకు నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

నేటి నుంచి భాగవత సప్తాహం

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ పట్టణం టీచర్స్ కాలనీలోని కమలా గార్డెన్‌లో ఈ నెల 15 నుంచి 21 వరకు భాగవత సప్తాహం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ సంస్థ జిల్లా ప్రతినిధి ఉదయశ్రీ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇస్కాన్ సంస్థ, భక్తి వృక్ష కేంద్రం ఆధ్వర్యంలో ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఇస్కాన్ బోధకులు శ్రీవరదరాజ దాస్ ఆధ్యాత్మిక ప్రవచనమిస్తారని వెల్లడించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

పదోతరగతి పరీక్ష సమయం పెంచాలని వినతి

పాలమూరు, న్యూస్‌టుడే: పదోతరగతి వార్షిక పరీక్షలలో జీవశాస్త్రం, భౌతిక శాస్త్రాల పరీక్షల సమయాన్ని మరో 20 నిమిషాల పాటు అదనంగా పెంచాలని టీపీఆర్టీయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా నాయకులతో కలిసి ఆయన హైదరాబాద్‌లోని పాఠశాల విద్యా రాష్ట్ర సంచాలకులు నరసింహారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం పరీక్షలలో విద్యార్థులు చిత్రాలు వేయాల్సి ఉంటుందని, అందువల్ల సమయం సరిపోక పోవడంతో వారు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఈ మేరకు పలువురు విద్యార్థులు, విషయ నిపుణులు, ఉపాధ్యాయులు గుర్తించి తమ సంఘం దృష్టికి తెచ్చారన్నారు. ఈ విషయం పట్ల విద్యా శాఖ సంచాలకులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీపీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భూపతిసింగ్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

బాలానగర్, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో నూతన ఎంపీడీవో అనిల్‌కుమార్‌రెడ్డిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయ సూపరింటెండెంట్ రాజశేఖర్‌పటేల్, నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, శంకర్‌నాయక్, శ్రీను, కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి మరమ్మతులేవీ?



నాగారంలో వర్షానికి దెబ్బతిన్న ఆరోగ్య ఉపకేంద్రం

దేవరకద్ర మండలం నాగారం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రం శిథిలావస్థకు చేరిందని పలుమార్లు అధికారులకు చెప్పినా మరమ్మతులు చేపట్టలేదు. ఇటీవలి వర్షాలకు ఆరోగ్య ఉపకేంద్రం పైకప్పు కూలిపోయింది. ఉపకేంద్రం సిబ్బంది పంచాయతీ కార్యాలయంలో రోగులకు సేవలు అందించాల్సి వస్తోంది. పంచాయతీ కార్యాలయంలో వసతులు సక్రమంగా లేకపోవడంతో సిబ్బందితో పాటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఆరోగ్య ఉపకేంద్రానికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, దేవరకద్ర గ్రామీణం

దేశభక్తికి, క్రమశిక్షణకు మారుపేరు ఆరెస్సెస్





భూత్పూర్ కూడలిలో పథసంచాలన్ నిర్వహిస్తున్న స్వయం సేవకులు.. నవాబ్‌పేట ఉన్నత పాఠశాల ఆవరణలో స్వయంసేవకులు

భూత్పూర్, న్యూస్‌టుడే : సంఘటితమే భారతదేశ సంపద, బలమని పాలమూరు విభాగ్ ధర్మ జాగరణ ప్రముఖ్ మాలె లక్ష్మీకాంత్ అన్నారు. విజయదశమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆరెస్సెస్ బుద్దాపురం ఖండ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. ఆరెస్సెస్ ఏ ఒక్క వ్యక్తికో, మతానికో పనిచేయదని, సర్వేజనోసుఖీనోభవంతు కోసం పనిచేస్తుందని చెప్పారు. సోమవారం భూత్పూర్ పట్టణంలో స్వయం సేవకులు పథ సంచాలన్ నిర్వహించారు. కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షులు ముఖ్య అతిథి మోదేపల్లి కొండయ్య, భూత్పూర్ ఖండ కార్యావాహ రేకులపాటి రాము, పుర అధ్యక్షుడు బస్వ రాజుగౌడ్ పాల్గొన్నారు.

నవాబ్‌పేట, న్యూస్‌టుడే : దేశభక్తికి, క్రమశిక్షణకు మారు పేరు ఆర్ఎస్ఎస్ అని ప్రముఖ్ శివశంకర్ పేర్కొన్నారు. 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం పథ సంచలన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రధాన వీధుల గుండా పథసంచలన్ నిర్వహించారు. సభ అధ్యక్షుడు శరత్‌కృష్ణ, నిర్వాహకులు అల్లంకి రఘు, శివాజీ, ప్రేమ్‌సుధాకర్, కురుమయ్య, చంద్రశేఖర్, స్వయం సేవకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

బాలానగర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ మండల నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల పథకంలో భాగంగా గ్యాస్ సబ్సిడీ రూ.500ల లబ్ధిదారులకు సోమవారం మండల కేంద్రంలో 610 ప్రొసిడింగ్ ధ్రువపత్రాలను అందజేసినట్లు తెలిపారు. నాయకులు కుర్వ శ్రీను, ప్రభాకర్, మహేష్, శివ తదితరులు ఉన్నారు.

బోధనా రుసుములు విడుదల చేయాలని డిమాండ్

పాలమూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గత ఆరేళ్ల నుంచి రూ. 8వేల కోట్లకు పైగా బోధన రుసుములు, ఉపకార వేతనాల బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే ప్రభుత్వం మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఫీజులు సకాలంలో రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బోధన రుసుములను మంజూరు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భరత్, నాయకులు నందు, ఈశ్వర్, రాము, ప్రవీణ్, శివ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల సందడి



పంచాయతీ కార్యదర్శికి ఇందిరమ్మ కమిటీ పేర్లను అందజేస్తున్న ఓబులాయపల్లి గ్రామస్థులు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు గ్రామ పంచాయతీల్లో, పురపాలికల్లోని వార్డుల్లో సోమవారం సందడి వాతావరణం నెలకొంది. కమిటీల్లో తమ పేర్లు నమోదు చేసుకునేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆసక్తి చూపుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 442 పంచాయతీలు ఉండగా తొలిరోజు 250 గ్రామాల్లో కమిటీలు పూర్తి చేసినట్లు సమాచారం వచ్చిందని అధికారులు తెలిపారు. జిల్లాలో మూడు పురపాలక సంఘాలు ఉండగా వాటి పరిధిలో 86 వార్డులు ఉన్నాయి. వీటిలో 60 వార్డుల కమిటీలు పూర్తయ్యాయి. మహబూబ్‌నగర్ పురపాలికలో 49 వార్డులు ఉండగా 35 వార్డుల కమిటీలు పూర్తయ్యాయి. జడ్చర్లలో 27 వార్డులు ఉండగా 17 వార్డులకు, భూత్పూర్‌లో 10 వార్డులు ఉండగా 8 వార్డులకు ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేశారు. కమిటీల్లో పేర్లు నమోదు చేసి ఏకగ్రీవంగా కమిటీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పంచాయతీలు, పురపాలికల వారిగా ప్రత్యేక ఫార్మెట్‌ను పంపించింది. గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేక అధికారిని ఛైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శిని కన్వీనర్‌గా నియమిస్తూ మరో ఐదుగురు సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. పురపాలిక వార్డుల్లో కౌన్సిలర్లు ఉండడంతో కౌన్సిలర్‌ను ఛైర్మన్‌గా, వార్డు ఆఫీసర్‌ను కన్వీనర్‌గా నియమిస్తూ మరో ఐదుగురు సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇటు పంచాయతీల్లో, పురపాలిక వార్డుల్లో ఇద్దరేసి స్వయం సహాయక సంఘాల మహిళలను సభ్యులుగా కమిటీల్లో తీసుకుంటున్నారు. వీరితో పాటు ఒక బీసీ, ఒక ఎస్సీ లేదా ఎస్టీ, జనరల్ కేటగిరిలో ఒకరిని కలిపి మరో ముగ్గురు సభ్యులను కమిటీలో నియమిస్తున్నారు. ఇలా ఐదుగురు సభ్యులతో మొత్తం ఏడుగురితో పంచాయతీల్లో, పురపాలిక వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు.

రూ.పది నాణాలు చట్టబద్ధమైనవి



రూ.పది నాణాలను పంపిణీ చేస్తున్న యూనియన్ బ్యాంకు అధికారులు

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే: రూ. పది నాణాలు చట్టబద్ధమైనవని యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం మెట్టుగడ్డ యూనియన్ బ్యాంకు శాఖలో నిర్వహించిన కాయిన్ మేళలో ఆయన పాల్గొన్నారు. రూ. పది నాణాలు చెల్లవనే అపోహలు వద్దన్నారు. ఎక్కడైనా ఇవి చెల్లు తాయాని రిజర్వు బ్యాంకు స్పష్టతనిచ్చిందని తెలిపారు. రూ. పది నాణాలు కావాల్సిన వారు సమీపంలోని యూనియన్ బ్యాంకు శాఖల్లోని అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ శ్రీనివాస్‌మూర్తి, బ్రాంచ్ మేనేజర్ అమిత్ సాహూ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో వదిలి వెళ్లిన బ్యాగు అందజేత

జడ్చర్ల, న్యూస్‌టుడే : ఆటోలో మరిచిపోయి వదిలి వెళ్లిన బ్యాగును డ్రైవర్ పోలీసులకు అప్పగించిన సంఘటన జడ్చర్లలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కర్నూల్ జిల్లాకు చెందిన రాఘవేంద్ర జడ్చర్లలో ఆటోలో బ్యాగును మర్చిపోయి వదిలి వెళ్లాడు. గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై సీఐ ఆదిరెడ్డి ఆటో యూనియన్ అధ్యక్షుడు షేక్ హాజీకి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన ఆటో డ్రైవర్ మున్నాకు సమాచారం ఇచ్చి పరిశీలించగా బ్యాగు ఉన్నట్టు గుర్తించి సీఐ సమక్షంలో అప్పగించారు. అందులో రూ. 5వేల నగదుతో పాటు పాన్‌కార్డు, ఏటీఎం కార్డు ఇతర ధ్రువపత్రాలు ఉన్నాయి. ఈసందర్భంగా సీఐ ఆటో డ్రైవర్, సంఘ నాయకులను అభినందించారు.

నిందితులకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

జడ్చర్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. స్థానికుల వివరాల ప్రకారం.. కొద్ది నెలల క్రితం రాజీవ్‌నగర్ కాలనీలో చిన్న ఆంజనేయులు హత్యకు గురయ్యారు. ఈ కేసులో నిందితులైన హతుడి భార్య భాగ్యమ్మ, ఆమె ప్రియుడు మహబూబ్‌నగర్‌కు చెందిన నరసింహ నిందితులు కాగా పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. ఇటీవలే వీరిద్దరు బెయిలుపై బయటికి వచ్చారు. సోమవారం అర్ధరాత్రి వీరితో పాటు మరో వ్యక్తి రాజీవ్‌నగర్ కాలనీలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా స్థానికులు వారిని స్తంభానికి కట్టేసి చితకబాదారు. నిందితులిద్దరిని పోలీసులకు అప్పగించగా మరొకరు పరారయ్యాడు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

సైదాబాద్, న్యూస్‌టుడే: మెరుగైన వైద్యం కోసం తీసుకొచ్చిన మూడు నెలల బాలుడు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మలక్‌పేట ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. సైదాబాద్ ఆస్మాన్‌గఢ్ పరిధిలోని ఓ ప్రైవేటు పిల్లల ఆసుపత్రికి మహబూబ్‌నగర్ జిల్లా అక్కారం గ్రామానికి చెందిన కేతావత్ హనుమంతు.. నిమోనియాతో బాధపడుతున్న తన మూడు నెలల కుమారుడిని ఈ నెల 9న తీసుకొచ్చాడు. మూడు రోజులు ఐసీయూలో చికిత్స అందించిన అనంతరం ఆదివారం జనరల్ వార్డుకు మార్చారు. సోమవారం మధ్యాహ్నం ఓ నర్స్.. ఇంజక్షన్ ఇచ్చి వెళ్లిన 10 నిమిషాల్లోనే బాబు చనిపోయాడు. వైద్యుల నిర్లక్ష్యమే బాలుడి మృతికి కారణమని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న మలక్‌పేట ఏసీపీ జి. శ్యాంసుందర్, మలక్‌పేట, డబీర్‌పురా ఠాణాల ఇన్‌స్పెక్టర్లు పిడమర్తి నరేశ్, ధరావత్ నాను నాయక్ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. సెక్టార్ ఎస్సై నవీన్ పోతుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బాలానగర్, న్యూస్‌టుడే: మండలంలోని ఉడిత్యాల గ్రామ శివారులో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు మార్గమధ్యలో ఆటోను ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పరూఖ్‌నగర్ మండలం బీమారం పంచాయతీ పరిధి మెల్లోనితండాకు చెందిన నందు, అరవింద్, అనిల్ కలిసి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే 108 సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించి అక్కడి నుంచి హైదరాబాద్‌లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులను సంప్రదించగా.. ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

మృతిపై కేసునమోదు

మిడ్జిల్, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. మండలంలోని వాడ్యాలకి చెందిన బొర్ర కృష్ణయ్య(48) ఈనెల 12న మండల కేంద్రంలో 167జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పడటంతో తీవ్రంగా గాయపడిన మృతిచెందిన విషయం విదితమే. సోమవారం మృతుడి బావ వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

జడ్చర్ల, న్యూస్‌టుడే : యువకుడి అదృశ్యంపై జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్సై చంద్రమోహన్ వివరాల ప్రకారం.. మండలంలోని కుర్వగడ్డపల్లికి చెందిన ఎం. రామ్‌చరణ్ (18) యువకుడు ఆదివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో తల్లి ఎం. కృష్ణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వివాహిత.. మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ మండల పరిధిలోని గాజులపేటకు చెందిన ఓ వివాహిత ఈ నెల 2న ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రి అయినా రాకపోవడంతో చుట్టూ పక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆమె జాడ కనిపించలేదు. దీంతో మంగళవారం ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణా ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

పాలసీదారుల ప్రయోజనాలు పెంచాలి



ధర్నాలో మాట్లాడుతున్న లియాఫీ రాష్ట్ర నేత సుదర్శనం

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్) న్యూస్‌టుడే: పాలసీదారుల ప్రయోజనాలను మరింతగా మెరుగుపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ హైదరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సుదర్శనం డిమాండ్ చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ ఎల్ఐసీ కార్యాలయం ఎదుట లియాఫీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన పాటు జోనల్ నాయకులు నలినికాంత్, గౌరిశంకర్, మహబూబ్‌నగర్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు హన్మంత్‌రెడ్డి, బసిరెడ్డి మాట్లాడారు. పాలసీదారుల చెల్లించే బోనస్ రేటును పెంచాలని, ప్రీమియం చెల్లింపుపై వేస్తున్న జీఎస్టీ భారాన్ని తగ్గించాలన్నారు. పాలసీదారుల ప్రయోజనాల పరిరక్షణకు లియాఫి దశల వారి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ధర్నాకి ఎల్ఐసీ ఉద్యోగ సంఘం నేతలు రాజేశ్వర్, కరుణాకర్‌గౌడ్ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో లియాఫి కోశాధికారి రాములు, ప్రతినిధులు శివనాయక్, శశిధర్, ఆర్. శ్రీనివాసులు, యాదేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా.. చెత్తశుద్ధి..!



గ్రామీణ ప్రాంతాల్లో ట్రాక్టర్లతో సేకరించిన చెత్త నుంచి ప్రకృతి సంపద తయారు చేయాల్సి ఉన్నా క్షేత్రస్థాయిలో పట్టించుకోవడం లేదు. రూ. లక్షలు వ్యయం చేసి డంపింగ్ యార్డుల నిర్మాణం చేపట్టినా.. లక్ష్యానికి దూరంగా ఉన్నాయి. మిడ్జిల్ మండలం మసిగుండ్లపల్లి గ్రామంలో డంపింగ్‌యార్డు ఎదుట చెత్త నిర్లక్ష్యంగా పారవేస్తుండటంతో దుర్వాసన వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయమై ఎంపీవో జగదీశ్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా స్పందిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- న్యూస్‌టుడే, జడ్చర్ల న్యూటౌన్

శ్రీరామకొండ ఆలయ పనులు చేపట్టాలి

కోయిలకొండ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీరామకొండపై శ్రీరాముని ఆలయ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని భారాస మండల అధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఆలయ నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేసి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ నిధులను రద్దు చేయడం తగదన్నారు. వెంటనే పనులను ప్రారంభించాలని కోరారు.

విజయవంతంగా అలయ్ బలయ్

జడ్చర్ల: దసరా పండుగ సందర్భంగా సోమవారం పట్టణంలో ''దసరా అలయ్ బలయ్'' కార్యక్రమాన్ని స్థానికంగా ఓ గార్డెన్‌లో నిర్వహించారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్చర్ల పట్టణ, పుర ప్రముఖులు రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా బాద్మి శివకుమార్, డా. రాంరెడ్డి, లక్ష్మయ్య, వెంకట్‌రావు, లక్ష్మయ్య, లతీఫ్, జంగయ్య, నర్సింహారెడ్డితో పాటు దాదాపు 65 మంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నేటి నుంచి గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయనున్నారు. రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ఆయా జిల్లాల పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారులు ప్రత్యేక బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో స్థానిక వైద్యాధికారులతో పాటు కింది స్థాయి సిబ్బంది పాల్గొంటారు. ఉమ్మడి జిల్లాలో 220 బృందాలు ప్రధానంగా గేదెలు, ఆవులకు టీకాలు వేస్తారు. మంగళవారం నుంచి మొదలయ్యే ఈ కార్యక్రమం వచ్చే నెల 14 వరకు కొనసాగుతుంది. పెంపకందార్లు ఉచితంగా ఈ టీకాలను వేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు, స్థానిక పశు వైద్య కేంద్రాల అధికారులు చెప్పారు. రైతులు ఎలాంటి డబ్బులు ఇవ్వరాదని వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్‌లోని వీరన్నపేటలోని పశు వైద్య కేంద్రంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం ప్రారంభించనున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

దేవరకద్ర గ్రామీణం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని అని ఎస్సై నాగన్న అన్నారు. సోమవారం దేవరకద్ర పట్టణ కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు చరవాణికి ఫోన్ చేసి ఓటీపీ వంటివి అడిగే చెప్పరాదన్నారు. యువకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఫులే విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

మహమ్మదాబాద్: వరంగల్ జిల్లా దేశాయిపేటలో మహాత్మా జ్యోతిరావు పులే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు డి. వెంకటేష్, భాజపా మండల అధ్యక్షుడు కృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మహమ్మదాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

హన్వాడ: మండలంలోని బుద్దారంలో మహిళల పట్ల కొందరు యువకులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే కారణంతో ఆదివారం రాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. సోమవారం ఉదయం మళ్లీ రెండు వర్గాల మధ్య ఘర్షణ జరగ్గా కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ పెద్దలు జోక్యం చేసుకొని రెండు వర్గాలలకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

పాలమూరు పురపాలకం: అప్పన్నపల్లి రైల్వే ట్రాక్ సమీపంలోని పొలం వద్ద సోమవారం విద్యుదాఘాతానికి గురై రెండు పాడి గేదెలు మృతి చెందాయి. మెయిన్‌లైన్ నుంచి వ్యవసాయ పంపు వరకు విద్యుత్తు లైను కోసం పాతిన కర్రను గేదెలు తాకడంతో తీగలు గేదెలపై పడటంతో సామె మూర్తయ్య, సామె భీమమ్మకు చెందిన రెండు గేదెలు మృతి చెందాయి. సంఘటనకు సంబంధించి రైతులు తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వడంతో ఆర్ఐ, వెటర్నరీ వైద్యుడు సంఘటన స్థలానికి చేరుకొని గేదెలను పరిశీలించి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు